కళాభారతికి పూర్వవైభవం తీసుకొస్తాం: మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, నవంబర్ 6: నగరపాలక సంస్థ ఆవరణలో ఉన్న కళాభారతిని ఆధునీకరించి పూర్వవైభవం తీసుకొస్తామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. బుధవారం కళాభారతిలో కలెక్టర్ ఆదేశాల మేరకు చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, జిల్లాలోని కళాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో నగరపాలక సంస్థ ఇప్పటికే ఎస్ఆర్ఆర్ కళాశాల ఆవరణలో నూతనంగా అమృతవర్షిణి ఆడిటోరియం నిర్మిస్తున్నదని తెలిపారు. ప్రస్తుతం ఆడిటోరియం అభివృద్ధి దశలో ఉందన్నారు. కళాభారతికి సైతం పూర్వ వైభవం తెచ్చేందుకు పునరుద్ధరణ పనులను చేపట్టామన్నారు. కళాభారతిని పూర్తి స్థాయిలో అందంగా తీర్చిదిద్ది వినియోగంలోకి తెచ్చేందుకు అవసరమైన నిధులను కేటాయించాలని కలెక్టర్‌ను కోరుతామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు చంద్రమౌళి, ఈఈ రొడ్డ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

10న నూతన కోర్టు భవనాల నిర్మాణానికి శంకుస్థాపన

కోర్టుచౌరస్తా, నవంబర్ 6: జిల్లా కేంద్రంలో ఈ నెల 10న జిల్లా కోర్టుల నూతన భవన సముదాయ నిర్మాణానికి రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే శంకుస్థాపన చేయనున్నారు. వీటితోపాటు సీతారాంపూర్ రోడ్‌లోని పాత రెవెన్యూ నివాస భవనాల ప్రాంతంలో న్యాయమూర్తుల కోసం నూతనంగా నిర్మించనున్న నివాస భవనాలకు కూడా ఆయన శంకుస్థాపన చేయనున్నట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. శంకుస్థాపన కార్యక్రమానికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో పాటు హైకోర్టు జడ్జి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ కె. లక్ష్మణ్, హైకోర్టు ఇతర న్యాయమూర్తులు జస్టిస్ వినోద్ కుమార్, జస్టిస్ బి. విజయసేన్ రెడ్డి, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్ కుమార్, జస్టిస్ ఈవీ వేణుగోపాల్, జస్టిస్ పుల్ల కార్తీక్, జస్టిస్ జె. శ్రీనివాసరావు హాజరవుతారని జిల్లా జడ్జి బి ప్రతిమ, కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్ కుమార్ తెలిపారు.

చేనేత కార్మికుల అవగాహన యాత్ర

జెండా ఊపి అవగాహన యాత్ర ప్రారంభిస్తున్న చేనేత, జౌళి శాఖ ఏడీ విద్యాసాగర్

కలెక్టరేట్, నవంబర్ 6: కరీంనగర్ చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన నేత కార్మికుల నైపుణ్య అవగాహన యాత్రలో నగరంలోని పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు. యాభై మందితో కలిసి బస్సులో హుజూరాబాద్‌లోని చేనేత సహకార సంఘ సందర్శనకు వెళ్లగా, చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు విద్యాసాగర్ జెండా ఊపి అవగాహన యాత్ర బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ సంఘంలో మగ్గాలు నేస్తున్న విధానాన్ని పరిశీలించారు. కార్మికులకున్న అనుమానాలు నివృత్తి చేసుకున్నారు. పురుషులతో పాటు మహిళా కార్మికులు కూడా యాత్రకు తరలివెళ్లారు. వీరి వెంట సొసైటీ సభ్యుడు గడ్డం శ్రీరాములు, తాటి రాజేశం, మోర రాజేశం, మల్లేశం, బూర మురళి, నల్ల చంద్రశేఖర్, రుద్ర శ్రీనివాస్, వేముల పురుషోత్తం, పిస్కా మల్లికార్జున్, దేవసాని రవి, శ్రీపతి కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో శ్రీప్రగతి విద్యార్థిని ప్రతిభ

విద్యార్థినిని అభినందిస్తున్న కరస్పాండెంట్ రాధాకృష్ణ

రామడుగు, నవంబర్ 6: హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు ఆసిఫాబాద్ కుమ్రం భీం జిల్లా కేంద్రంలో జరిగిన 38 రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ప్రతిభ కనబరిచి రజత పతకం సాధించింది. ఆ జట్టులో పాల్గొని ప్రతిభ చూపిన రామడుగు మండలం గోపాల్‌రావుపేట శ్రీ ప్రగతి హైస్కూల్ ఏడో తరగతి విద్యార్థిని వేముండ్ల హాసినిని బుధవారం పాఠశాల కరస్పాండెంట్ అన్నదానం రాధాకృష్ణతో పాటు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వీర్ల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బసరవేణి లక్ష్మణ్, పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

సమగ్ర సర్వే వివరాలు గోప్యం

- ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలి
- కలెక్టర్ పమేలా సత్పతి
- స్టిక్కరింగ్ కార్యక్రమం పరిశీలన



చిగురుమామిడి: రేకొండలో ఇంటింటా కుటుంబ సర్వేలో పాల్గొన్న కలెక్టర్

కలెక్టరేట్/చిగురుమామిడి, నవంబర్ 6: జిల్లాలో చేపట్టబోయే సమగ్ర కుటుంబ సర్వే వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంటాయని, కుటుంబ వివరాలు తెలుసుకునేందుకు వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలంతా సహకరించాలని కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో స్టిక్కరింగ్ కార్యక్రమం బుధవారం ప్రారంభం కాగా, అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలు విధిగా వాస్తవ సమాచారం మాత్రమే అందించాలని సూచించారు. అంతకుముందు కలెక్టర్ తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ గ్రామపంచాయతీ పరిధిలోని 6వ వార్డులో, చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలోని 13వ వార్డు, చిగురుమామిడి మండల కేంద్రంలోని 10వ వార్డులో ఎన్యుమరేటర్లు ఇళ్లకు స్టిక్కరింగ్ చేసే ప్రక్రియను పరిశీలించారు. ఆమె వెంట తిమ్మాపూర్ ఎంపీడీవో టి.విజయ్‌కుమార్, తహసీల్దార్ కె.విజయ్‌కుమార్, కార్యదర్శి శ్రీవాణి, చిగురుమామిడి ఎంపీడీవో మధుసూదన్, ఆర్ఐ సంతోష్, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

సర్వేను పరిశీలించిన అధికారులు

మానకొండూర్/ చొప్పదండి/ హుజూరాబాద్ టౌన్/ వీణవంక/ సైదాపూర్/ రామడుగు/ ఇల్లందకుంట/ గంగాధర, నవంబర్ 6: ఎన్యుమరేటర్లు చేపట్టిన ఇండ్ల జాబితా ప్రక్రియను అధికారులు పరిశీలించారు. మానకొండూర్ మండల కేంద్రంలో మండల ప్రత్యేకాధికారి, డీఆర్డీవో శ్రీధర్ పరిశీలించగా, ఇక్కడ ఎంపీడీవో వరలక్ష్మి, ఎంపీవో కిరణ్, పంచాయతీ కార్యదర్శి రేవంత్ రెడ్డి ఉన్నారు. అలాగే హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలో సర్వేను మున్సిపల్ సర్వే ప్రత్యేకాధికారి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ పి. పవన్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సల్వాది సమ్మయ్య పరిశీలించారు. ఇల్లందకుంట మండలం శ్రీరాంలపల్లిలో సర్వే తీరును ఎంపీడీవో పుల్లయ్య, వీణవంక మండలంలో ఏఎస్‌వో రమేశ్, ఎంపీడీవో శ్రీధర్, సైదాపూర్‌లో ఎంపీడీవో యాదగిరి, గంగాధరలో ఎంపీడీవో రాము, మండలంలోని ముప్పిడినర్సయపల్లి, కోట్లనర్సింహుపల్లి గ్రామాల్లో ఎంపీవో జనార్దన్‌రెడ్డి సర్వేను పరిశీలించారు. రామడుగు మండలం వెదిరలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద నివాసానికి ఎన్యుమరేటర్ సర్వే స్టిక్కర్ వేయగా, ఆమె తమ కుటుంబ సభ్యుల వివరాలను అందించారు. చొప్పదండి పట్టణంలో స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ప్రత్యేకాధికారి ప్రియదర్శిని, మున్సిపల్ కమిషనర్ నాగరాజు ప్రారంభించారు.

రైస్ మిల్లర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- జిల్లా ప్రత్యేకాధికారి ఆర్‌వీ కర్ణన్

కలెక్టరేట్, నవంబర్ 6: జిల్లాలోని రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. ధాన్యం మిల్లింగ్‌పై పౌరసరఫరాల శాఖ అధికారులు, కొనుగోలు కేంద్రాల ఏజెన్సీల యంత్రాంగం, రైసు మిల్లర్లతో కలిపి బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యం ప్రకారం మిల్లర్లు తప్పనిసరి బ్యాంకు గ్యారెంటీ, సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం శుభ్రం చేయకుండా కొనుగోలు చేయద్దని ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. మిల్లుల్లో తాలు పేరుతో కోతలు పెడితే కఠినంగా వ్యవహరించాల్సి వస్తదని హెచ్చరించారు. ఈ సందర్భంగా రైసుమిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలు ఏకరువు పెడుతూ, మిల్లర్ల సంఘం ప్రతినిధులు ప్రత్యేకాధికారి కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, సివిల్ సప్లై డీఎం రజినీకాంత్, డీఎస్‌వో నర్సింగరావు, డీసీవో రామానుజాచారి, అధికారులు, మిల్లర్ల సంఘం జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

గంగాధర, నవంబర్ 6 : మధురానగర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా ప్రత్యేకాధికారి ఆర్వీ కర్ణన్ కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి బుధవారం తనిఖీ చేశారు. కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ అడిషల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో రాము, కేంద్రం నిర్వాహకులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి

తిమ్మాపూర్, నవంబర్ 6: మండలంలోని రేణికుంట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోళ్లు జరుపుతున్న తీరును పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లలో మోసాలకు తావుండకూడదన్నారు. తాలు, తరుగు పేరుతో కోతలు విధించడం తగదన్నారు. కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. రేపు కూడా కొనుగోలు కేంద్రానికి వచ్చి పరిశీలిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. కాగా, మంత్రి పొన్నం ప్రభాకర్ రేణికుంట నుంచి కరీంనగర్ వెళ్తున్న సమయంలో నుస్తులాపూర్‌లో ఆటోను ఓ బైక్ ఢీకొన్నది. ఈ ప్రమాదంలో గాయపడ్డ మహిళ, మరో వ్యక్తిని మంత్రి తన కాన్వాయ్‌లోని వాహనంలో హాస్పిటల్‌కు పంపించి ఔదార్యాన్ని చాటారు.

ఈవీఎం గోదాంల తనిఖీ

కలెక్టరేట్, నవంబర్ 6: కలెక్టరేట్ వెనుకభాగంలో గల ఈవీఎంల గోదాంలను జిల్లా రెవెన్యూ అధికారి బీ వెంకటేశ్వర్లు బుధవారం తనిఖీ చేశారు. పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారుల సమక్షంలో ఈవీఎంలు భద్రపరిచిన గదులు పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.మహేశ్వర్, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

గంగాధర, నవంబర్ 6: ఆర్‌అండ్‌బీ శాఖ ఈఎన్‌సీ మోహన్‌నాయక్‌ను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కొండాపూర్ నుంచి విలాసాగర్ వయా చిన్న ఆచంపల్లి రోడ్డు పనుల పూర్తికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఇక్కడ నాయకులు అట్ల శేఖర్‌రెడ్డి, వీర్ల నర్సింగరావు తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED HELPERS

jobs Apply Now!

★హైదరాబాద్ నందు 5 స్టార్ హోటల్‌లో పని చేయుటకు ''హెల్పర్లు'' కావలెను. 12 గంటల డ్యూటీ, 18,000/- జీతం, రూమ్+ఫుడ్ ఫ్రీ. వయస్సు: 18-30 సం॥లు. No Consultency, Direct Job. Contact: 9885283513.
NT-335863_All

CHANGE OF NAME

★I, AFREEN KHANAM (Old Name) W/o. ABDUL HAMEED KHAN, R/o. H.No: 2-1-260, STREET: DUBBA WADA, Mandal: METPALLY-505325, District Jagtial, Telangana, Have changed my name as AFREEN NAAZ.
NTK-325733

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

ఎట్టకేలకు ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లు

గంగాధర, నవంబర్ 6 : మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో ఎట్టకేలకు బుధవారం ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితం కావడం, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టిన క్రమంలో ప్రభుత్వం కేంద్రాలకు మిల్లులు కేటాయించడంతో నిర్వాహకులు కొనుగోళ్లను ప్రారంభించారు. గంగాధర సింగిల్ విండో ఆధ్వర్యంలో 15 కేంద్రాల్లో 3,136 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా, 1551 క్వింటాళ్లు మిల్లులకు తరలించారు. అలాగే కురిక్యాల సింగిల్ విండో ఆధ్వర్యంలో 13 కేంద్రాల్లో 1500 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించినట్లు నిర్వాహకులు తెలిపారు. కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభం కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పీహెచ్‌సీల ఆకస్మిక తనిఖీ

విద్యానగర్, నవంబర్ 6: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ బుధవారం జిల్లాలోని కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రేకుర్తి బస్తీ దవాఖాన, పద్మనగర్, సప్తగిరికాలనీ అర్బన్ హెల్త్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సెంటర్లలో అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు.

సొంత నిధులతో డ్రైనేజీ సైడ్ వాల్ నిర్మాణం

కార్పొరేషన్, నవంబర్ 6: తమ డివిజన్‌లో ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న భారీ డ్రైనేజీతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అనేకమార్లు నగరపాలక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో 4వ డివిజన్ కార్పొరేటర్ నుజత్ అలీ తన సొంత నిధులను వెచ్చించి బుధవారం సైడ్ వాల్ నిర్మాణం చేపట్టారు. ఈ పనుల కోసం నిధులు కేటాయించినా టెండర్లు నిర్వహించడంలో ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కార్పొరేటర్ ఆరోపించారు. నగర కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో తానే సొంత నిధులను వెచ్చించి రోడ్డుపై వెళ్లే వాహనదారులకు ఇబ్బంది లేకుండా డ్రైనేజీ సైడ్ వాల్ నిర్మాణం చేసినట్లు తెలిపారు.

11న అప్రెంటిస్‌షిప్ మేళా

కమాన్‌చౌరస్తా, నవంబర్ 6 : ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులకు ఈ నెల 11న ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళాను ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ ఐటీఐ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ కె. అశోక్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన జాతీయ స్థాయి కంపెనీ అయిన మేధా సర్వో డ్రైవ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఎలక్ట్రిషియన్ 100, ఫిట్టర్ 100, ఎలక్ట్రానిక్ మెకానిక్ 60 ఖాళీలు, స్పైండర్ ఎలక్ట్రిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఎలక్ట్రిషియన్ ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్‌లో 200 ఖాళీలు, ఎంఈటీ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో ఫిట్టర్ టర్నర్ మిషనిస్టు మొత్తం కలిపి 50 ఖాళీలు, కరీంనగర్‌కు చెందిన ఆదర్శ ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో డీజిల్ మెకానిక్ 10, మెకానిక్ మోటార్ వెహికల్ 10, వెల్డర్ 40, ఫిట్టర్ 40, కోపా ఫిమేల్ 10 ఖాళీలు ఉన్నాయని వెల్లడించారు. ఎంపికైన వారికి రూ.12 వేల చొప్పున స్టైఫండ్ ఇస్తారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు apprinticeshipindia.gov.in/mela& registration వైబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్ కాఫీ, రెజ్యూమ్, ఎస్ఎస్‌సీ మెమో, ఐటీఐ మెమో, రెండు ఫొటోలతో మేళాకు హాజరుకావాలని సూచించారు.

గౌరవెల్లి ప్రాజెక్టు భూ సేకరణపై గ్రామసభ

చిగురుమామిడి, నవంబర్ 6: ఉల్లంపల్లి గ్రామంలో గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్ భూ సేకరణ నోటిఫికేషన్‌పై గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ హాజరయ్యారు. గౌరవెల్లి కెనాల్ నిర్మాణంలో గ్రామంలో భూమి కోల్పోతున్న రైతుల వివరాలను అధికారులు గ్రామ సభలో చదివి వినిపించారు. ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని ఆర్డీవో రైతులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కెనాల్ కోసం భూ సేకరణ చేపడుతున్నామని తెలిపారు. గ్రామ సభలో ఇరిగేషన్ ఈఈ రాములు, డీఈ ప్రశాంత్, ఏఈ నెహ్రూ, ఆర్ఐ అరుణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ కోచ్‌గా రామకృష్ణ బిందు మాధవన్

కొత్తపల్లి, నవంబర్ 6 : జిల్లా యువజన, క్రీడాశాఖ (డీఎస్ఏ)కు బ్యాడ్మింటన్ కోచ్‌గా రామకృష్ణ బిందు మాధవన్ బుధవారం నియమితులయ్యారు. కలెక్టర్ అనుమతితో వన్ ఇయర్ డిప్లొమా పూర్తి చేసిన ఆయనను బ్యాడ్మింటన్ కోచ్‌గా ఎంపిక చేసినట్లు డీవైఎస్‌వో వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

జిల్లా హాకీ జట్టుకు కోచ్‌గా హుజూరాబాద్ వాసి

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 6: సంగారెడ్డిలో రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొంటున్న అండర్-17 జిల్లా హాకీ జట్టుకు కోచ్‌గా హుజూరాబాద్‌లోని మారుతీనగర్‌కు చెందిన మోటపోతుల విక్రమ్ వ్యవహరిస్తున్నాడు. విక్రమ్ ప్రస్తుతం రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌లో పీఈటీగా విధులు నిర్వర్తిస్తుండగా, అతడిని కోచ్‌గా ఎంపిక చేయడంపై హుజూరాబాద్ హాకీ క్లబ్ సభ్యులు, పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని ఇద్దరి మృతి

- మరొక యువకుడికి తీవ్ర గాయాలు

రాంనగర్, నవంబర్ 6: జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాల సమీపంలో బుధవారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరొకరు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. కొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన చిలుముల సాయికృష్ణ, అతడి స్నేహితులైన తాండ్ర శ్రీహాస్, మామిడిపల్లి నాగరాజు ప్లాట్‌ఫాం 65 రెస్టారెంట్‌లో పని చేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి విధులు ముగించుకుని కొత్తపల్లికి వెళ్లేందుకు సాయికృష్ణ వాహనంపై ముగ్గురు బయలు దేరారు. ఈ క్రమంలో జగిత్యాల వైపు వెళ్లాల్సిన లారీని డ్రైవర్ ఆకస్మాత్తుగా ఎడమ వైపునకు తిప్పి రోడ్డుపై నిలిపేశాడు. ఎలాంటి ఇండికేటర్లు లేకుండా లారీ పక్కకు రావడం, వెనుకాలే వేగంగా వస్తున్న సాయికృష్ణ ద్విచక్ర వాహనం లారీని ఢీకొట్టడంతో లారీ కిందికి చొచ్చుకుపోయారు. ఈ ఘటనలో సాయికృష్ణ, శ్రీహాస్, నాగరాజుకు తీవ్ర గాయాలు కాగా, సాయికృష్ణ అక్కడిక్కడే చనిపోయాడు. ఎదురుగా ఉన్న రెస్టారెంట్ సిబ్బంది ప్రమాదం జరిగిన విషయం గమనించి క్షతగాత్రులను చికిత్స కోసం దవాఖానకు తరలిస్తుండగా, మార్గమధ్యంలో శ్రీహాస్ మృతి చెందాడు. తీవ్ర గాయాలతో ఉన్న మామిడిపల్లి నాగరాజును మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. పేద కుటుంబాలకు చెందిన ఆ ముగ్గురూ తల్లిదండ్రులకు భారం కాకూడదని రెస్టారెంట్‌లో ఉద్యోగం చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఈ ఘటనతో వారి కుటుంబ సభ్యులు శోక సముద్రంలో మునిగిపోయారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. సాయికృష్ణ తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ రజినేష్ ప్రసాద్ మిశ్రాపై కేసు నమోదు చేసి లారీని స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

గంగాధర, నవంబర్ 6 : కరీంనగర్ మెడ్‌కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మండలంలోని నారాయణపూర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రారంభించారు. వైద్య శిబిరంలో గ్రామస్తులు 140 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఇక్కడ మాజీ సర్పంచ్ ఎండీ నజీర్, సింగిల్ విండో డైరెక్టర్లు బాబు మల్లేశం, పొన్నం రాములు, వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుడికి ఆర్థిక సాయం

తిమ్మాపూర్, నవంబర్ 6: నేదునూరు గ్రామ పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్న ఎలగందుల భూమయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా, విషయం తెలుసుకున్న నుస్తులాపూర్ మాజీ సర్పంచ్ తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు బుధవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. రూ. 5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డిగాని రాజు, మామిడి అనిల్ కుమార్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్థిర ప్రతిష్ఠాపన కార్యక్రమం

కమాన్‌చౌరస్తా, నవంబర్ 6 : జిల్లా కేంద్రంలోని పాతబజార్ చిన్న హనుమాన్ దేవస్థానం పునర్నిర్మాణంలో భాగంగా బుధవారం వేద పండితుడు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో సశిఖర దీపస్తంభ, శివపంచాయతన స్థిర ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతితో కార్యక్రమాలు ముగించారు. ఇక్కడ నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్మెంట్ సెంటర్.. పెద్దమ్మ గుడి

తిమ్మాపూర్, నవంబర్ 6: వచ్చునూర్ గ్రామంలో యువత నైపుణ్యాలను పెంపొందించేందుకు గానూ గత ప్రభుత్వ హయాంలో రూ.4లక్షల డీఎంఎఫ్టీ నిధులతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కోసం నిర్మించిన భవనాన్ని గ్రామానికి చెందిన లక్ష్మణ్ అనే వ్యక్తి ఆక్రమించి పెద్దమ్మ తల్లి ఆలయంగా తీర్చిదిద్దుతున్నాడని అదే గ్రామానికి చెందిన ఉప్పులేటి కుమార్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం అంతా స్థానిక అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నదని ఫిర్యాదులో పేర్కొన్నారు. భవనంతోపాటు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఖజానాకు గండి కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కారు ఈఎంఐలు చెల్లించలేక.. యువకుడి ఆత్మహత్య

శంకరపట్నం, నవంబర్ 6: కారు రుణం వాయిదాలు చెల్లించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి గ్రామానికి చెందిన దాసారపు శ్యామ్ (26) మూడేండ్ల క్రితం బ్యాంక్ రుణం తీసుకుని కారు కొన్నాడు. కారును ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో లీజుకు కుదుర్చుకొని నడుపుతున్నాడు. వారం క్రితం దీపావళికి స్వగ్రామానికి వచ్చాడు. కారు లోన్‌కు సంబంధించిన పలు వాయిదాలు ఇప్పటికే పెండింగ్‌లో ఉన్నట్లు తల్లి తిరుపతవ్వకు చెప్పి వా